


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | ఆదివారం | 04-10-2026 | సంపుటి: 3 | సంచిక: 240 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 04-10-2026 | V0LUME : 3 | ISSUE : 240 | PAGES: 8 | COST: 2/- |

## సైబర్ ప్రపంచంలో చిన్నారుల రక్షణ మన బాధ్యత

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ
- 'నల్సా' ఆధ్వర్యంలో చిన్నారుల భద్రతపై జాతీయ సదస్సు

2






## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సమగ్ర

# చైల్డ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎన్ఎఎల్ఎస్ఏ దక్షిణ మండల ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభం
- ఉచిత న్యాయ సేవల కోసం సంచార లోక్ అదాలత్ వాహనాలు ప్రారంభం
- సైబర్ హెల్ప్‌లైన్ '1930', చైల్డ్ హెల్ప్‌లైన్ '1098' పై అవగాహన పెంచాలి

**హైదరాబాద్, అక్టోబర్ 3 (రాజముద్ర):**

పిల్లల ఆన్‌లైన్ భద్రతను రక్షించేందుకు తెలంగాణ హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలతో చర్చించి సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్ ను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా శనివారం ప్రారంభమైన దక్షిణ మండల ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో పేదలు, బలహీన వర్గాలకు న్యాయాన్ని ఒక ఆయుధంగా అందించేందుకు న్యాయ

మిగతా 2వ పేజీలో..





## విద్య, వైద్యంపై సీఎం ఫోకస్

- సీఎంవో అధికారులతో సమీక్ష
- పాఠశాలలు, హాస్పిటల్స్‌ను కలెక్టర్లు సందర్శించాలి

2

## ఐదు భాషలకు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'

- శాస్త్రీయ భాషల అధ్యయనం, అభివృద్ధికి కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం
- అస్సామీ, బెంగాలీ, మరాఠీ, పాలి, ప్రాకృత్ భాషలకు ప్రత్యేక కేంద్రాలు

4

## రైస్ మిల్లర్లపై సర్కార్ ఉక్కుపాదం

- సీఎంఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని పౌర సరఫరాల శాఖ హెచ్చరిక
- ఏడు రోజుల్లో షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వాల్సిందే
- బకాయిలు చెల్లించకపోతే ఆస్తుల జప్తు
- ఆర్ఆర్ చట్టం కింద రికవరీకి ప్రత్యేక డ్రైవ్
- అధికారులకు అక్టోబర్ 5 నుంచి ప్రత్యేక శిక్షణ

2



## అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు!

- అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా
- ఐదుగురి దుర్మరణం.. 12 మందికి పైగా గాయాలు
- మృతుల్లో ముగ్గురు మహిళలు..
- పలువురికి తీవ్ర గాయాలు

**వికారాబాద్, అక్టోబర్ 3 :**

వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ఘాట్‌రోడ్డులో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శనివారం ఉదయం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందగా 12 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో

మిగతా 2వ పేజీలో..



---



## మావోయిజం నుంచి వెండితెరకు..

4

- తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు ఛాన్స్
- * ర్యాంప్‌వాక్ వీడియోలతో బాలీవుడ్ నిర్మాతల దృష్టిని ఆకర్షించిన మాజీ మావోయిస్టులు
- 1994 బస్తర్ ఘటన ఆధారంగా సినిమా తెరకెక్కించే ప్రయత్నాలు

## యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- తక్కువ నీటితో పండే పప్పు ధాన్యాలు, నూనె గింజల వైపు మళ్లాలి
- 'రైతు నేస్తం' 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీ ప్రారంభం
- 50% నుంచి 100% సబ్సిడీపై విత్తనాలు



3

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

- మెట్రో, బస్సుల్లో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి
- ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం
- మెట్రో-ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం
- ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్, అక్టోబర్ 3(రాజముద్ర):**

హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీమెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో

మిగతా 2వ పేజీలో..





## ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

- మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజా భవన్‌లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు
- హాజరైన మంత్రులు పొన్నం, అడ్లూరి

3

## 22-ఏ పరిష్కారంలో మరో కీలక అడుగు

- నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, అక్టోబర్ 3 (రాజముద్ర) :**

నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూముల వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. నాలా రుసుము చెల్లింపుతో అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం అయింది. దీనిపై జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. మెమో

మిగతా 3వ పేజీలో..



## 10 నుండి 18 వరకు బతుకమ్మ వేడుకలు

- ఏర్పాట్లపై సీఎస్ సంజయ జాజు సమీక్ష

2



## బ్యాలెట్‌తో ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా?

- కాంగ్రెస్ సీఎంలారా.. రాజీనామా చేసి రండి
- జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం?
- అనివార్య కారణాల వల్ల అమిత్ షా టూర్ వాయిదా
- కేంద్ర మంత్రి బండి సంజయ్

3

# విద్య, వైద్యంపై సీఎం ఫోకస్

**హైదరాబాద్, అక్టోబర్ 3 (రాజముద్ర) :**

రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సీఎంవో అధికారులతో సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రధాన హాస్పిటల్స్ నిర్మాణాలు, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా హాస్పిటల్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, హాస్పిటల్స్ నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతోపాటు అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, హాస్పిటల్స్‌ను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైనచోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి లక్ష్యమే ఉన్నత

# విద్య పరమార్థం కావాలి

**హైదరాబాద్, అక్టోబర్ 3 :**

తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాక వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో శనివారం నిర్వహించిన 'రీచ్ 2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.
తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. 'ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం' ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. సదస్సులో సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచఈ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ వీసీ¾ ప్రొఫెసర్ ఎం.కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతోపాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## 10 నుండి 18 వరకు

# బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 3:**

తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకత ఉన్న బతుకమ్మ పూల పండగను ఈనెల 10 నుండి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ట్యాంక్ బండ్‌పై వేలాదిమంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్‌పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాదిమంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాక పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుద్దీపాలతో అలంకరించాలని, నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుద్దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచఎండీఏ, జీహెచఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరుగనున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. బతుకమ్మ జరిగే పది రోజులపాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కూడా ఈ లోగోలో తెలియచేసేలా రూపొందించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణిప్రసాద్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, జీహెచఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మల్కాజిగిరి సీపీ బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టీకల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జల మండలి కమిషనర్ అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ.నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సమగ్ర 'చైల్డ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్'

మొదటిపేజీ తరువాయి

సేవా సంస్థలు పనిచేస్తున్నాయని కొనియాడారు. ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ న్యాయానికి దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సాంకేతిక పురోగతి సాధించినప్పటికీ అమాయకులైన పిల్లలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉందన్నారు. ఈ సదస్సుకు పిల్లల సైబర్ భద్రత అనే చాలా ముఖ్యమైన అంశాన్ని ఎంచుకున్నందుకు జస్టిస్ విక్రమ్ నాథ్ కి, ఎన్ఏఎల్ఎస్ఏకు ధన్యవాదాలు తెలిపారు.
ఈ రోజుల్లో పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. కానీ తమ పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు అనేది చాలామంది తల్లిదండ్రులకు తెలియడం లేదు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన జీవితాలను ఎంతో సులభం చేశాయి. ప్రపంచంలోని సమాచారం మన చేతిలోకి వచ్చింది. ఎక్కడున్న వారితోనైనా, ఎప్పుడైనా మాట్లాడగలుగుతున్నాం. కానీ పిల్లలు అమాయకులు. ఏది నిజం? ఏది అబద్ధం? ఏది మంచిది? ఏది ప్రమాదకరం? అన్నది వారు వెంటనే గుర్తించలేరు. తెలియక పిల్లలు చేసే చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చు. వాటి ప్రభావం పిల్లలపైనే కాదు.. వారి కుటుంబాలపై, సమాజంపై కూడా పడుతుంది. ఇంటర్నెట్ ఈ నేరాలను సృష్టించలేదు. కానీ నేరాలను ప్రపంచవ్యాప్తంగా చేయడం మరింత సులభం చేసింది. తల్లిదండ్రులకు ఏం జరుగుతుందో తెలియకపోవచ్చు. భయంతో పిల్లలు తమ సమస్యలను ఎవరికీ చెప్పలేకపోవచ్చు. అందుకే పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి? మన పిల్లలను ఎలా సురక్షితంగా ఉంచాలి? బాధిత పిల్లలకు న్యాయం ఎలా అందించాలి? మన ముందున్న ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మాట్లాడుతూ వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో అవగాహనతో గమనించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లల రక్షణకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేశంలోనే తొలి 'చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, షీ భరోసా, సైబర్ ల్యాబ్‌లు, యాప్ ద్వారా ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. టీజీఎస్ఎల్ఎస్ఏ, పాఠశాల విద్యాశాఖ ఒప్పందం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని, ఇప్పటికే 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే బాధితులు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను సంప్రదించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు. న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం. న్యాయం అంటే అతని గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. ముఖ్యంగా ఒక బిడ్డ కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం అని అన్నారు. న్యాయ సేవా సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. 'సంచార లోక్ అదాలత్' వాహనాల ప్రారంభం ఉచిత న్యాయ సేవలను గ్రామీణ ప్రాంతాలకు, ప్రజల వద్దకే చేరవేసే లక్ష్యంతో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'సంచార లోక్ అదాలత్' ప్రత్యేక వాహనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి.మోహన, జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ ఆర్. మహదేవన్, ప్రజాప్రతినిధులు, న్యాయ నిపుణులు పాల్గొన్నారు.




# అనంతగిరి ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా

మొదటిపేజీ తరువాయి

పలువురికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల్ని రక్షించేందుకు స్థానికులు, పోలీసులు రంగంలోకి దిగారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వాళ్లను చికిత్స కోసం సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. పటాన్‌చెరులోని కేసారంలో ఓ వ్యక్తి మరణించగా అతని అంత్యక్రియలు చింతకుంటలో నిర్వహించాల్సి ఉంది. ఈ కార్యక్రమం కోసం హాజరయ్యేందుకు 50మంది ప్రైవేట్ బస్సులో బయల్దేరారు. ఘాట్ రోడ్డు గుండా కిందకు దిగుతున్న సమయంలో డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు వేగంగా రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ప్రమాదం జరగగానే ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భయాందోళనకరంగా మారింది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ స్నేహా మెహ్రా**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ప్రమాద స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అనంతరం హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. క్షతగాత్రులకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

వికారాబాద్ బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతగిరి హిల్స్ ఘాట్ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రైవేటు బస్సు ప్రయాణికులు దుర్మరణం పాలైన ఘటనపై ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటనపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని తెలిపారు.

**ప్రమాదంపై హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి**

బస్సు దుర్ఘటన పట్ల బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ తీవ్ర విషాద సమయంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే, ఈ దుర్ఘటనలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని, సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలి : కేటీఆర్**




బస్సు ప్రమాద ఘటన తీవ్రంగా కలచివేసిందని కేటీఆర్ అన్నారు. మృతుల కుటుంబాలకు 'ఎక్స్'లో తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులను వెంటనే రక్షించి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు సహాయక చర్యల్లో పాల్గొనాలని స్థానిక బీఆరఎస్ నాయకత్వానికి సూచించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి అవసరమైన సహాయం అందేలా స్థానిక నాయకులు అధికారులతో సమన్వయం చేసుకోవాలని, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని అన్నారు.

# సైబర్ ప్రపంచంలో చిన్నారుల రక్షణ మన బాధ్యత

- **సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ**
- **'నల్సా' ఆధ్వర్యంలో చిన్నారుల భద్రతపై జాతీయ సదస్సు**

**హైదరాబాద్, అక్టోబర్ 3 :**

మానవాళికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి చిన్నారులేనని, సైబర్ ప్రపంచంలో వారిని లైంగిక దోపిడీ నుంచి కాపాడుకుంటూ సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ స్పష్టం చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సైబర్ స్పేస్‌లో చిన్నారులకు న్యాయం - లైంగిక దోపిడీ నివారణ అనే అంశంపై ప్రతిష్టాత్మక సదస్సును శనివారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యమంత్రితో పాటు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**పిల్లలకు కరవవుతున్న 'సమయం'**

మారుతున్న ఆధునిక జీవనశైలిలో ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులపై పని ఒత్తిడి పెరిగిపోయి పిల్లల కోసం తగినంత సమయం కేటాయించలేకపోతున్నారన్నారు. మరోవైపు మిగిలిన సమయాన్ని సైబర్ ప్రపంచం హరించేస్తోందని జస్టిస్ నరసింహ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను సురక్షితంగా ఉంచడానికి అత్యంత చౌకైనది, కానీ నేడు దొరకకుండా చేజారిపోతున్న అత్యంత ముఖ్యమైన సాధనం పిల్లలతో గడిపే సమయం అన్నారు. నిర్మాణ ప్రదేశాల్లో పనిచేసే కూలీల పిల్లలు సైతం మొబైల్ ఫోన్లలో లీనమైపోతున్న పరిస్థితి నేడు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉపాధ్యాయులకు తగిన గౌరవం దక్కాలి**

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి సహకారం లేకుండా ఏ చిన్నారీ ఉత్తమ పౌరుడిగా ఎదగలేడు.. కానీ మన పాఠశాలల్లో ముఖ్యంగా స్థానిక భాషా ఉపాధ్యాయులకు తగిన గౌరవం, మర్యాద దక్కడం లేదన్న భావన ఉంది.. ఈ దృక్పథం మారాలి అని అన్నారు. ఉపాధ్యాయులకు తగిన సమయం, భద్రత కల్పించినప్పుడే వారు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దగలరని చెప్పారు.

**వృద్ధుల సమాజంగా మారే ప్రమాదం**

మన దేశంలో జననాల (ఫెర్టిలిటీ) రేటు క్రమంగా పడిపోతోందని తెలిపారు. సౌకర్యవంతమైన భర్తీ నిష్పత్తి 2.1 నుంచి ప్రస్తుతం 1.97కి పడిపోయామని, ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు తరాల తర్వాత జపాన్ తరహాలో మన సమాజం కూడా వృద్ధుల సమాజంగా మారిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మనకున్న ఈ చిన్నారులు అనే ఆస్తిని బలోపేతం చేసుకోవాలని సూచించారు. చట్టాలు, సాంకేతికతను ఉపయోగించి వారికి పూర్తి భద్రత కల్పించాలన్నారు. కాగా, తన ప్రసంగం ప్రారంభంలో జస్టిస్ నరసింహ హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఇక్కడి వాతావరణంలోనే పెరిగానని, గాలి పటాలు ఎగరేస్తూ, సైకిల్ తొక్కుతూ, రాత్రి వరకూ ఆడుకుంటూ ఎంతో సురక్షితమైన వాతావరణంలో స్వేచ్ఛగా గడిపిన తన బాల్య జ్ఞాపకాలను సభికులతో పంచుకున్నారు. దేశ భవిష్యత్తును సురక్షితం చేయడమంటే పిల్లల భవిష్యత్తును సురక్షితం చేయడమేనని అరవిందుడి సూక్తిని ఈ సందర్భంగా ఉటంకించారు.

**చట్టాల్లో మార్పులు రావాలి**

తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లల కోసం సమయాన్ని కేటాయించేలా గ్యారెంటీ ఇచ్చేందుకు వీలుగా వినూత్న చట్టాలు తీసుకురావాలిలన్నారు. ఇందుకు తెలంగాణ రాష్ట్రమే చొరవ తీసుకుని దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఒక చిన్నారికి అత్యుత్తమ భద్రత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే లభిస్తుందని చెప్పారు.



# రైస్ మిల్లర్లపై సర్కార్ ఉక్కుపాదం

**హైదరాబాద్, అక్టోబర్ 3:**

ప్రభుత్వానికి ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలను చెల్లించకుండా తప్పించుకునే రైస్ మిల్లర్లపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. కనీస మద్దతు ధరతో ప్రజాధనంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు.

**ఆస్తుల జప్తునకు ప్రత్యేక డ్రైవ్**

సీఎంఆర్ బకాయిలను రాబట్టేందుకు రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. బకాయిలున్న మిల్లర్ల నుంచి నిధుల రికవరీతో పాటు వారి ఆస్తులను వేగంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది. చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా, ఆస్తుల జప్తు ప్రక్రియలో సాంకేతిక లోపాలకు అవకాశం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా పౌర సరఫరాల శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో అక్టోబర్ 5 నుంచి ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది.

**ఏడు రోజుల్లో వివరణ**

మిల్లుల్లో అధికారులు నిర్వహించే ఆకస్మిక తనిఖీల్లో గోదాముల్లో ఉండాల్సిన పరిమాణం కంటే ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు తేలితే వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. నోటీసులు అందుకున్న మిల్లర్లు ఏడు రోజుల్లోగా తమ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వకపోయినా, ఇచ్చిన వివరణతో అధికారులు సంతృప్తి చెందకపోయినా తదుపరి చర్యలు తప్పవని శాఖ స్పష్టం చేసింది. అవసరమైతే ఆస్తుల జప్తుతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

# కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

రైలు, ఆర్టీసీ బస్సులో శనివారం ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది.. మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. ప్రయాణం సులభమైందా.. వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన**

కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రోఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందన్నారు.

**బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట**

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రోబస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి**

ఆర్టీసీమెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతున్నదని చెప్పారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రోఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.



**ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం**

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీమెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని అన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డెయిలీ పాస్, మంత్లీ పాస్‌తోపాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్‌మెట్రో) ఎన్.వి.ఎస్. రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం

హైదరాబాద్, అక్టోబర్ 3 :

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగానే కాకుండా ప్రాజెక్టుల్లో నీటి కొరత నెలకొన్న నేపథ్యంలో, రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో రైతులు తక్కువ నీటితో, స్వల్పకాలంలో పండే ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఉదయం ప్రసారమైన 'రైతు నేస్తం' 109వ ఎపిసోడ్‌లో పాల్గొన్న ఆయన, జాతీయ ఆహార భద్రతా మిషన్ జాతీయ నూనె గింజల మిషన్ పప్పుధాన్యాల మిషన్ కింద రబీ 202627 సీజన్‌కు సంబంధించిన పప్పుధాన్యాలు, నూనె గింజల సబ్సిడీ విత్తనాల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు.

**ప్రాజెక్టుల నీటి నిల్వల ఆధారంగా సాగు ప్రణాళికలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూ నీటి కొరత తీవ్రతను దృష్ట్యా రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ పెట్టుబడితో మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వులు, శనగలు, మినుములు, పెసలు వంటి పంటలను ఎంచుకోవాలని కోరారు. జిల్లాల వారీగా ఉన్న ప్రాజెక్టుల నీటి నిల్వల ఆధారంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో పటిష్టమైన నీటి పారుదల ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతుల అభ్యర్థన మేరకు ఇతర పంటలకు సబ్సిడీపై స్ప్రింక్లర్లను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఆయిల్‌పామ్ గెలల కోత అనంతరం వేగంగా ఫ్యాక్టరీలకు తరలించి, రైతులకు త్వరితగతిన బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**భారీ సబ్సిడీతో విత్తన పంపిణీ వివరాలు**

రైతులకు విత్తన రకం, మార్కెట్ విడుదల కాలం, నిబంధనల ఆధారంగా 50% నుంచి 75% వరకు, కొన్ని ప్రత్యేక రకాలకు 100% సబ్సిడీపై విత్తనాలు అందించబడుతున్నాయి. నూనె గింజల పంపిణీ పథకానికి రూ. 49.35 కోట్లు కేటాయించగా రూ. 34.55 కోట్లు విడుదలయ్యాయి. 52,425 ఎకరాల్లో సాగు కోసం 29,375 క్వింటాళ్ల విత్తనాలను రూ.36.76 కోట్ల సబ్సిడీతో అందిస్తున్నారు. వేరుశనగ: గిర్నార్4, గిర్నార్5, కదిరి లేపాక్షి, TCGS 894 (35,325 ఎకరాలు - రూ. 35.33 కోట్లు) కుసుమ ISF 764 / లక్ష్మీప్రియ (4,000 ఎకరాలు - రూ. 16.80 లక్షలు) పొద్దుతిరుగుడు SUNH1, KBSH 85 (4,500 ఎకరాలు - రూ. 53.32 లక్షలు) నువ్వులు JCS 1020 (7,400 ఎకరాలు - రూ.29.16 లక్షలు)

**పప్పు ధాన్యాల పంపిణీ**

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు రూ. 34.60 కోట్లు కేటాయించగా, 21 జిల్లాల్లో 29,008 క్వింటాళ్ల విత్తనాలను రూ. 15.25 కోట్ల సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. శనగలు NBeG452, NBeG47, NBeG49 (83,053 ఎకరాలు) మినుములు VBN8, VBN10 (16,958 ఎకరాలు) పెసలు MGG 385 (9,801 ఎకరాలు)

**రైతులకు అధికారుల విజ్ఞప్తి**

యాసంగిలో తక్కువ నీటితో లాభదాయక పంటలు సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు రైతులు వెంటనే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి విత్తనాలు పొందాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# 'గ్రేటర్' అభివృద్ధికి పక్కా ప్రణాళికలు అవసరం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 3 :

గ్రేటర్ హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి కేవలం నినాదాలతో సాధ్యం కాదని, పాలనా యంత్రాంగం పూర్తి సమన్వయంతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించి పనిచేసినప్పుడే సాధ్యమవుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా 'దిశా' కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మహానగరం విస్తరిస్తున్న కొద్దీ జిల్లాల సరిహద్దులు, కార్పొరేషన్లు వేరైనా నగరాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి తదితర జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ పరిధిలోని ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు, కమిషనర్లు తరచూ సంయుక్తంగా సమీక్షలు నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సమకూరే మొత్తం ఆదాయంలో 70 నుండి 80 శాతం ఒక్క హైదరాబాద్ పరిసర జిల్లాల నుంచే వస్తోందని మంత్రి గుర్తు చేశారు. అలాంటి మహానగరంలో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు వంటి సంస్థలు నిధుల కొరతతో సతమతం కావడం విచారకరమన్నారు. రొటీన్ బడ్జెట్ కేటాయింపులతో సరిపెట్టుకోకుండా నగర ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ పెంచుకునేందుకు అధికారులు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మెట్రో, మూసీ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులు ప్రభుత్వ ఆలోచనల ప్రకారం జరుగుతున్నప్పటికీ సామాన్య ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం, అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ లీకేజీల నియంత్రణ, మురుగునీరువర్షపునీరు వేరు చేసే శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో అలసత్వం వహించరాదన్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి మారాలని, పనులన్నీ సకాలంలో పూర్తి కావాలని సూచించారు. పేదల బస్తీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వ్యయంతో ఫ్లోరింగ్, టైల్స్, పెయింటింగ్, తాగునీటి వసతులు, పిల్లలకు దుప్పట్లు, యూనిఫాంలు వంటి సకల సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన అనుభవాన్ని ఆయన



ప్రస్తావించారు. బస్తీల్లో ప్రాథమిక విద్య, వైద్యం, పారిశుధ్య వసతులను మెరుగుపరచడంలో అధికార యంత్రాంగం ఒక కుటుంబంలా బాధ్యతగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటికి సరిపోయేలా రాష్ట్ర అధికారులు సరైన డీపీఆర్‌లు, ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని స్పష్టం చేశారు. అధికారులు నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం నుంచి హైదరాబాద్‌కు, తెలంగాణకు నిధులు మంజూరు చేయించి తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

- మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజా భవన్‌లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు
- హాజరైన మంత్రులు పొన్నం, అడ్లూరి

హైదరాబాద్, అక్టోబర్ 3 (రాజముద్ర):

ఆటో కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికుల న్యాయమైన సమస్యలన్నింటినీ మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆటో సంఘాల నాయకులతో భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలను రవాణా శాఖ మంత్రి పొన్నం లోతుగా అధ్యయనం చేసి కేబినెట్ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఆటో చార్జీల పెంపుపై డ్రైవర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించి కిలోమీటరుకు రూ.11గా ఉన్న చార్జీని రూ.14కు పెంచుతూ జీవో జారీ చేసిందన్నారు. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఆటో చార్జీని కిలోమీటరుకు రూ.11గా నిర్ణయించిందని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్న పాలకులు ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోలేదని, వారు అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని విమర్శించారు.

**సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ**

రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని, వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. చట్ట సభల్లో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల ఇతర అంశాలపైనా కొంత సమయం తీసుకుని న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కేవలం జీవోలు జారీ చేసి ప్రచారం చేసుకోవడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. ప్రజాభవన్‌కు ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులను ఆహ్వానించి వారితో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే ఈ సమావేశం ఉద్దేశమన్నారు. ప్రభుత్వం తమది, ప్రజలదే అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు.

**డీజిల్ ఆటోలకు బదులు బ్యాటరీ ఆటోలు**

నగరం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. నగరంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దిల్లీ వంటి నగరాల్లో కాలుష్యం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. డీజిల్ ఆటోలను బ్యాటరీ ఆటోలుగా మార్చేందుకు 'రాజీవ్ యువ వికాసం' కింద రూ.200 కోట్లను కేటాయించామని తెలిపారు. ఒక్కో ఆటోకు ప్రభుత్వం తరపున రూ.1.50 లక్షల సబ్సిడీ అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో సోలార్, బ్యాటరీ, సీఎన్‌జీ ఆటోలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నంను భట్టి అభినందించారు.

# 22ఏ పరిష్కారంలో మరో కీలక అడుగు

మొదటిపేజీ తరువాయి

నెం.48062/య□ఎల్‌సీ/ఎ/1/2026 ద్వారా అర్హత ఉన్న దరఖాస్తులను కాల పరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. 22ఎ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో వేగం పుంజుకుంది. ఇప్పటికే ప్రభుత్వం ఐదు ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, జీవో 118, జీవో 76లకు అనుగుణంగా మార్గదర్శకాలు జారీ. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు ఉన్న 22ఎ ఇళ్లు, ఫ్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యూఎల్‌సి దరఖాస్తుల పరిష్కారానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యకు కూడా పరిష్కారం చూపింది. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, 22ఎ సమస్యల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ□ చేయాలని రెవెన్యూ అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు.



# నిరుద్యోగుల కలల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి
- పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

హైదరాబాద్, అక్టోబర్ 3 (రాజముద్ర):

నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అండగా నిలిచేందుకు 'పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ కేవలం ఆర్థిక పరిస్థితుల వల్ల ఎవరూ వెనుకబడకూడదన్నదే తమ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా ఒక్కో అభ్యర్థికి సుమారు రూ. 40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్ యాక్సెస్‌ను పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తిగా ఉచితంగా అందిస్తామని నిరుద్యోగ యువతకు మంత్రి హామీ ఇచ్చారు. యువత ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత కొలువులు సాధించాలని ఆకాంక్షించారు.



# బ్యాలెట్‌తో ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా?

హైదరాబాద్, అక్టోబర్ 3 :

కేంద్ర ఎన్నికల కమిషన్‌పై, ఈవీఎంలపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఈవీఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గెలిచింది కదా.. మరి ఆ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమా అని అడిగారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి శనివారం సాయంత్రం విచ్చేసిన కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ పార్టీ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, సంగప్ప, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు, బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆయన ఎన్డీయే మంత్రి కాదు.. సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అని చెప్పారు. అసలు ఇండి కూటమికి జనాదరణ లేదని, వాళ్ల ఆందోళన కార్యక్రమాలకు పట్టుమని పదిమంది కూడా రావడం లేదని, ముంబై, దిల్లీల్లో ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'సర' ప్రక్రియలో భాగంగా సీపీఎం దొంగ ఓట్లను తొలగించడంవల్లే కేరళలో అధికారంలోకి వచ్చామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారు కదా.. మరి దీనికి కాంగ్రెస్ నేతలు ఏమంటారు అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ రావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆయన పర్యటన వాయిదా పడిందని బండి సంజయ్ తెలిపారు.

**మచ్చార్ ధైర్యసాహసాలపై స్పందించకపోవడం సిగ్గుచేటు**

ప్రపంచమంతా కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను కొనియాడుతుంటే రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసిన వ్యక్తి సామాజికవర్గం ఓట్లు పోతాయోయేమోననే భయంతోనే వాళ్లు స్పందించడంలేదని, అలాంటి వాళ్లంతా తన దృష్టిలో దేశద్రోహులు, దిమాగీ నక్సల్సేనని అన్నారు.

**ఆలయంపై దాడి హేయనీయం**

దిల్‌సుక్‌నగర్‌లో సంతోషిమాత ఆలయంపై దాడి హేయనీయమన్నారు.. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో దాడి చేసిన వాళ్లపై చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. దాడి చేసిన మతం వాళ్లు బాధపడతారనే కారణంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రజలు ప్రశ్నిస్తే దాడి చేసినోడిని పిచ్చోడిగా చిత్రీకరించడం అలవాటైందని విమర్శించారు. పిచ్చోడికి మందిర్, మసీదు అనే తేడా తెల్వదు.. కానీ మందిరాలపైనే ఎందుకు దాడి చేస్తున్నారు అని అడిగారు. హిందువులు దీటుగా స్పందించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం పద్దతి మార్చుకుని దాడి చేసిన వాళ్లపై కఠినంగా వ్యవహరించాలని, లేకపోతే యువత రోడ్లపైకి వచ్చి తిరగబడితే వాళ్లను ఆపే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

**కాంగ్రెస్, బీఆరఎస్ దొందూ దొందే**

బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ జరిపి చర్యలు తీసుకోదు.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ పోరాడదు అని మంత్రి బండి ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని సీబీఐకి ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాయలేదన్నారు. కేసీఆర్ కుటుంబానికి పూర్వమే చింతమడకలో వందల ఎకరాలున్నాయనడం పెద్ద జోక్ అంటూ ఆనాడు వాళ్లకు హైదరాబాద్‌లో అసలు ఇల్లే లేదు.. అధికారంలోకి వచ్చాకే ఇన్ని హోటళ్లు, ఆస్తులు ఎట్లా వచ్చాయి అని ప్రశ్నించారు. కాగా, టీచర్లు, గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగ యువత బీజేపీ పక్షానే ఉన్నారని, గతంలో రెండు ఎమ్మెల్సీ సీట్లను తాము కైవసం చేసుకోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల్లో బీజేపీకి సానుకూలత ఉందని, ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ బీజేపీ గెలుపు తథ్యం అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# నిరసనలను నమోదు చేయండి



- **పార్లమెంటు లోపల, బయటా ప్రజల గొంతుకనై పోరాడతా**
- **కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**
- **ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొనేందుకు 'సత్యాగ్రహ' ప్రారంభం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:**

దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై జరుగుతున్న వివిధ రూపాల ఆందోళనలు, నిరసనలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సరికొత్త డిజిటల్ వేదికను అందుబాటులోకి తెచ్చింది. మహాత్మా గాంధీ 157వ జయంతి స్ఫూర్తితో సత్యాగ్రహ అనే వినూత్న డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రారంభించారు. ప్రభుత్వాల చేతిలో అణచివేతకు గురవుతున్న గొంతుకలకు ఈ ప్లాట్‌ఫామ్ బలమైన భరోసా ఇవ్వనుందని ఆయన స్పష్టం చేశారు.

**ఒంటరి పోరాటాలకు ముగింపు**

దేశంలో భూమి కోసం, మహిళా హక్కుల కోసం, దళితఓబీసీ హక్కుల కోసం, అలాగే విద్య, పరీక్షల పత్రాల లీకేజీలు వంటి విభిన్న అంశాలపై ఎన్నో నిరసనలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే, చాలామంది తమ హక్కుల కోసం ఒంటరిగా పోరాడుతూ ప్రభుత్వాల చేతిలో అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'బాపు మనకు సత్యాన్ని మించిన ఆయుధం లేదని నేర్పించారు.. అంతకంటే గొప్ప ఆయుధం సత్యంతో కలిసికట్టుగా నిలబడటం.. విడివిడిగా జరిగే పోరాటాలను ఒకే డిజిటల్ మ్యాప్‌లోకి తెచ్చి ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడమే 'సత్యాగ్రహ' ప్రధాన ఉద్దేశం' అని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా వివరించారు. నిరసనలు తెలిపే వారు ఎలాంటి సంకోచం లేకుండా ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. తమ నిరసన పెద్దదైనా, చిన్నదైనా సరే 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌లోకి వెళ్లి రెండు నిమిషాల్లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. తమ పేరు, గ్రూప్ వివరాలు, ఏ అంశంపై పోరాడుతున్నారో స్పష్టంగా పొందుపరచాలని కోరారు.

**ప్రతిపక్ష నేతగా అండగా ఉంటా**

ఈ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన నిరసనల వివరాలను పరిశీలించి, బాధితులకు తగిన మద్దతు అందిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఎక్కడైతే సత్యం అణచివేయబడుతుందో అక్కడ వారికి అండగా నిలవడం ప్రతిపక్ష నేతగా తన బాధ్యత అని చెప్పారు. పార్లమెంటు వేదికగా గళం వినిపించడంతోపాటు రోడ్డెక్కి పోరాడేందుకైనా, లేఖలు రాసేందుకైనా తాను ముందుంటానని, ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసేది లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# మావోయిజం నుంచి వెండితెరకు..

- **తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు ఛాన్స్**
- **ర్యాంప్‌వాక్ వీడియోలతో బాలీవుడ్ నిర్మాతల దృష్టిని ఆకర్షించిన మాజీ మావోయిస్టులు**
- **1994 బస్తర్ ఘటన ఆధారంగా సినిమా తెరకెక్కించే ప్రయత్నాలు**
- **ఆడిషన్ల తర్వాత ఎంపికైన వారికి ప్రత్యేక నటనా శిక్షణ**
- **నవంబర్, డిసెంబర్‌లో బస్తర్ అటవీ ప్రాంతాల్లో షూటింగ్**

**హైదరాబాద్, అక్టోబర్ 3:**

హింసా మార్గాన్ని వీడి సాధారణ జీవనంలోకి అడుగుపెట్టిన తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు వెండితెరపై తమ జీవితానుభవాలను ప్రతిబింబించే అవకాశం దక్కనుంది. మావోయిజం నేపథ్యంలో తెరకెక్కనున్న ఓ బాలీవుడ్ చిత్రంలో వీరిని కొన్ని కీలక పాత్రల కోసం పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో లొంగిపోయిన మహిళా మావోయిస్టులు ర్యాంప్‌వాక్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాలీవుడ్ చిత్ర నిర్మాతల దృష్టి వారిపై పడింది.

**నిజ జీవిత అనుభవాలే బలం**

మావోయిస్టుల జీవితాల ఆధారంగా ఓ చిత్రాన్ని రూపొందించేందుకు బాలీవుడ్‌కు చెందిన ఓ నిర్మాత సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సినిమాలోని కొన్ని పాత్రలకు మాజీ మహిళా మావోయిస్టులను ఎంపిక చేయాలని చిత్రబృందం భావిస్తోంది. మావోయిజం ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూసిన వారి అనుభవాలు పాత్రలకు



సహజత్వాన్ని తీసుకొస్తాయని మేకర్స్ అభిప్రాయపడుతున్నారు.

ఆడిషన్ల ద్వారా నటులను ఎంపిక చేసి, ఎంపికైన మాజీ మావోయిస్టులకు ప్రత్యేకంగా నటనలో శిక్షణ ఇవ్వనున్నారు. 1994లో బస్తర్ ప్రాంతంలో జరిగిన ఓ సున్నితమైన వాస్తవ ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు తెలుస్తోంది.

**బస్తర్ అడవుల్లో షూటింగ్**

సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగాన్ని నవంబర్, డిసెంబర్ నెలల్లో బస్తర్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది.

ఒకప్పుడు తుపాకులు పట్టిన చేతులు.. ఇప్పుడు నటనతో తమ అనుభవాలను తెరపై ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తికర పరిణామంగా మారింది.

# సీజేపీ–కాంగ్రెస్ మధ్య ముదిరిన మాటల యుద్ధం

- **అభిజిత్ దీప్కేను లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారన్న రాంకా, దాస్**
- **'సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్స్'పై సీజేపీ నేతల తీవ్ర వ్యాఖ్యలు**
- **బీజేపీ కంటే సొంత ఎకోసిస్టమ్ మరింత తీవ్రంగా వ్యవహరిస్తోందని విమర్శ**
- **'రాజ్యాంగానికి సెల్ఫ్ డిక్లేర్డ్ థేకేదార్లు' అంటూ సౌరవ్ దాస్ సెటైర్**
- **సీజేపీపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతమ్ సింగ్ కౌంటర్**
- **అరెస్టుల సమయంలో సాయం చేసినా కనీస మర్యాద చూపలేదని వ్యాఖ్య**

**ముంబై, అక్టోబర్ 3:**

ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసనల అనంతరం ఆ పార్టీకి, కాంగ్రెస్‌కు మధ్య మాటల యుద్ధం మొదలైంది. సీజేపీ నేతలు అభిజిత్ దీప్కేను లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం ప్రచారం చేస్తోందంటూ 'లిబరల్ ఎకోసిస్టమ్'పై తీవ్ర విమర్శలు చేశారు. సీజేపీ కో కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు.

రాంకా ఎక్స్‌లో చేసిన పోస్టులో 'సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్ ఎకోసిస్టమ్' అభిజిత్ దీప్కేను విమర్శించేందుకు మళ్లీ యాక్టివ్ అయిందని ఆరోపించారు. చాలా కాలం తర్వాత లక్షలాది భారతీయుల ఊహలను దీప్కే ఆకర్షిస్తుండటాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎక్స్ వేదికకే పరిమితమైన ఆ వర్గం తమనే ప్రజాస్వామ్యానికి ఏకైక రక్షకులుగా భావిస్తోందని విమర్శించారు.

**'రాజ్యాంగానికి థేకేదార్లు'**

రాంకా వ్యాఖ్యలకు సౌరవ్ దాస్ మద్దతు తెలిపారు. బీజేపీకి చెందిన వారు కాకపోయినా కొందరు తామే 'భారత్, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత' తీసుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారిని 'సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్స్', 'రాజ్యాంగానికి సెల్ఫ్ డిక్లేర్డ్ థేకేదార్లు'గా అభివర్ణించారు. ఈ ఎకోసిస్టమ్ బీజేపీ ఎకోసిస్టమ్ కంటే కూడా తీవ్రంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'డివైడ్ అండ్ రూల్' తరహా రాజకీయాలతో ప్రజలను విభజించలేరని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ కౌంటర్**

రాంకా, దాస్ తమ పోస్టుల్లో ఏ పార్టీ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, వారి వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఉద్దేశించినవేనన్న చర్చ మొదలైంది. దీంతో కాంగ్రెస్ నుంచి కూడా స్పందన వచ్చింది. అస్సాం కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతమ్ సింగ్ మాట్లాడుతూ.. అస్సాంలో సీజేపీ సభ్యులను, అశుతోష్ రాంకాను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు సహాయం చేశారని తెలిపారు. అయినప్పటికీ కనీస మర్యాదగా సీజేపీ నేతలు కాంగ్రెస్ నాయకులను కలవలేదని విమర్శించారు.

సీజేపీని అరవింద్ కేజ్రీవాల్‌ను తిరిగి రాజకీయంగా ముందుకు తీసుకొచ్చే వేదికగా మార్చొద్దని రీతమ్ సింగ్ సూచించారు. దీంతో ముంబై నిరసనల నేపథ్యంలో మొదలైన వివాదం సీజేపీ-కాంగ్రెస్ మధ్య బహిరంగ విమర్శలు, ప్రతివిమర్శలకు దారితీసింది.




# శివాజీ పార్క్ నిరసనపై పోలీస్ కేసులు

- **మహారాష్ట్ర పోలీస్ చట్టంలోని 37(1)(3), 135 సెక్షన్ల ప్రయోగం**
- **మైనర్లను 'రక్షణ కవచాలుగా' ఉపయోగించారన్న ఆరోపణలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటో**

**ముంబై, అక్టోబర్ 3:**

ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శివాజీ పార్క్‌లో అనుమతి లేకుండా ఆందోళన చేపట్టినందుకు నిరసన నిర్వాహకులతో పాటు 400-500 మంది గుర్తుతెలియని సీజేపీ మద్దతుదారులు, ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు ముంబై పోలీసులు వెల్లడించారు.

**చట్టవిరుద్ధంగా నిరసనపై కేసులు**

శివాజీ పార్క్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 189, 223 సెక్షన్లతో పాటు మహారాష్ట్ర పోలీస్ చట్టంలోని 37(1)(3), 135 సెక్షన్లను పోలీసులు ప్రయోగించారు. అనుమతి లేకుండా నిరసన నిర్వహించడమే కేసులకు ప్రధాన కారణమని అధికారులు తెలిపారు.

**మైనర్ల అంశంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పందన**

మరోవైపు సీజేపీ నిరసన కార్యక్రమాల్లో మైనర్ పిల్లలను 'రక్షణ కవచాలు'గా ఉపయోగించారన్న విమర్శలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్పందించింది. ఈ వ్యవహారంపై ముంబై పోలీస్ కమిషనర్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది.

# మైనర్ల వినియోగంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

- **సీజేపీ శివాజీ పార్క్ నిరసనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటో విచారణ**
- **మైనర్లను 'రక్షణ కవచాలుగా' ఉపయోగించారన్న ఆరోపణలపై దర్యాప్తు**
- **ముంబై పోలీస్, ఎక్స్, కేంద్ర, మహారాష్ట్ర శాఖలకు నోటీసులు**
- **ఫొటోలు, వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ ఆధారాల పరిశీలనకు ఆదేశం**

**ముంబై, అక్టోబర్ 3:**

జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో నిర్వహించిన నిరసనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్పందించింది. ఆందోళనలో మైనర్లను ఉపయోగించారంటూ వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కమిషన్.. నిరసనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశాన్ని కూడా పరిశీలిస్తోంది.

**'రక్షణ కవచాలుగా' ఉపయోగించారా?**

సేవా న్యాయ ఉత్థాన్ ఫౌండేషన్ ప్రతినిధి సతీష్ వైద్ చేసిన ఫిర్యాదులో.. నిరసనకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఫొటోల్లో చిన్నారులు కనిపించారని, కొందరు నినాదాలు చేస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. మైనర్లను నిరసనలో భాగం చేయడంపై ముందుగానే గ్రూపులు, చాట్‌లలో చర్చలు జరిగాయని ఫిర్యాదులో ఆరోపించారు. పోలీసుల చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు చిన్నారులను 'రక్షణ కవచాలుగా' ఉపయోగించాలనే ఉద్దేశం ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని కోరారు. అయితే ఇవి ఫిర్యాదులోని ఆరోపణలేనని, వాటి వాస్తవాలను దర్యాప్తులో తేల్చాల్సి ఉంది.

**నలుగురికి నోటీసులు**

ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని ధర్మాసనం ముంబై పోలీస్ కమిషనర్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఎక్స్ కార్ప్ గ్రీవెన్స్ ఆఫీసర్, మహారాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. నిరసనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలించాలని ముంబై పోలీసులను ఆదేశించింది. దర్యాప్తులో కాగ్నిజబుల్ నేరం బయటపడితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది.

**జువైనల్ జస్టిస్ చట్టంపైనా దృష్టి**

మైనర్లను ముందుగానే ప్రణాళికలో భాగంగా నిరసనకు తీసుకువచ్చారా? చట్టపరమైన చర్యలను అడ్డుకునేందుకు వారి ఉనికిని ఉపయోగించారా? అనే అంశాలను పరిశీలించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ కోరింది. జువైనల్ జస్టిస్ చట్టంలోని సంబంధిత నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అలాగే




పిల్లల గుర్తింపును, గోప్యతను కాపాడుతూ వారి ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో మరింతగా ప్రచారం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

**వారం రోజుల్లో నివేదిక**

ముంబై పోలీసులు దర్యాప్తులో భాగంగా నిరసనకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను భద్రపరచడంతో పాటు నిర్వాహకులు, సమన్వయకర్తలు, పిల్లల వెంట వచ్చిన పెద్దలు, తల్లిదండ్రులు లేదా సంరక్షకుల పాత్రలను పరిశీలించాలని కమిషన్ సూచించింది. సంబంధిత అధికారులు వారం రోజుల్లో యాక్షన్ టేకింగ్ రిపోర్ట్ (ఏటీఆర్) సమర్పించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

# ఐదు భాషలకు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'

- **శాస్త్రీయ భాషల అధ్యయనం, అభివృద్ధికి కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం**
- **అస్సామీ, బెంగాలీ, మరాఠీ, పాలి, ప్రాకృత్ భాషలకు ప్రత్యేక కేంద్రాలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:**

భారతీయ భాషల పరిరక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ కేంద్ర విద్యాశాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది.

దేశంలోని ఐదు శాస్త్రీయ భాషల సమగ్ర అధ్యయనం, అభివృద్ధి కోసం ఐదు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 3న పీఐబీ ఢిల్లీ ద్వారా వెల్లడించింది.

భాషా, సాహిత్య వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడంతో పాటు ప్రాచీన భాషలకు సంబంధించిన విజ్ఞానాన్ని డిజిటలైజ్ చేయడం, ఆధునిక విద్యా రంగంలో పరిశోధనలను ప్రోత్సహించడం ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యంగా కేంద్రం పేర్కొంది. ఆయా భాషలకు సంబంధించిన పరిశోధన వనరులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వాటి విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయనున్నారు.

**ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారంటే..**

క్లాసికల్ అస్సామీకి సంబంధించిన సెంటర్‌ను అస్సాంలోని తేజ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. క్లాసికల్ బెంగాలీ కోసం పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేశారు. క్లాసికల్ మరాఠీ కేంద్రాన్ని మహారాష్ట్రలోని పుణెలో ఉన్న దెక్కన్ కాలేజ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేయనున్నారు. క్లాసికల్ పాలి కోసం ఒడిశాలోని కేంద్ర విశ్వవిద్యాలయంలో, క్లాసికల్ ప్రాకృత్ కోసం గుజరాత్‌లోని కేంద్ర విశ్వవిద్యాలయంలో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కానున్నాయి. ఈ కేంద్రాల ద్వారా భారతదేశ భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వంపై మరింత విస్తృతంగా అధ్యయనం, పరిశోధనకు అవకాశం ఏర్పడుతుందని విద్యాశాఖ తెలిపింది. ప్రాచీన భాషలకు సంబంధించిన విలువైన విజ్ఞానాన్ని భద్రపరచడంతో పాటు వాటిని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి.

# ఫైటర్ స్క్వాడ్రన్ల కొరత.. ఏటా 40 జెట్లు అవసరం

- **ప్రతి ఏడాది 36–40 కొత్త యుద్ధ విమానాలు అవసరమన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్**
- **ప్రస్తుతం 29 ఫైటర్ స్క్వాడ్రన్లు.. అవసరం 42**
- **తేజస్ ఎంకే-1ఏ, ఎంకే-2, ఎంఆర్ఎఫ్ఏ, ఏఎంసీఏపై దృష్టి**
- **114 రాఫెల్ జెట్ల ఒప్పందం ఈ ఆర్థిక సంవత్సరంలో ఖరారయ్యే అవకాశం**
- **రక్షణ ప్రాజెక్టుల్లో జాప్యంపై ఏపీ సింగ్ ఆందోళన**
- **ఏఐ, డ్రోన్లు, అంతరిక్ష సామర్థ్యాలపై వైమానికదళం ఫోకస్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:**

భారత వైమానిక దళంలో ఫైటర్ జెట్ స్క్వాడ్రన్ల సంఖ్య మరింత తగ్గకుండా ఉండాలంటే ప్రతి ఏడాది 36 నుంచి 40 కొత్త యుద్ధ విమానాలు అవసరమని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. ఇది సుమారు రెండు ఫైటర్ స్క్వాడ్రన్లకు సమానమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కొరతను పూడ్చడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అదనపు యుద్ధ విమానాలను చేర్చుకోవాల్సి ఉందన్నారు.

ఎయిర్‌ఫోర్స్ డేకు ముందు నిర్వహించిన వార్షిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ రంగ ప్రాజెక్టుల్లో చోటుచేసుకుంటున్న జాప్యం వైమానికదళ కార్యాచరణ సామర్థ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. సాంకేతిక ప్రాజెక్టులు ఆలస్యం కావడం అంటే అందుబాటులోకి రావాల్సిన టెక్నాలజీని ఆలస్యం చేయడమేనని పేర్కొన్నారు. అభివృద్ధి, ఉత్పత్తి ప్రక్రియలు ఎక్కువ కాలం కొనసాగితే అప్పటికే ప్రత్యర్థులు ఆ సాంకేతికతను అధిగమించే అవకాశం ఉంటుందని వివరించారు.

యుద్ధ విమానాల కొరతను అధిగమించేందుకు తేజస్ ఎంకే1ఏ, తేజస్ ఎంకే2, 114 విమానాల ఎంఆర్ఎఫ్ఏ ప్రాజెక్ట్, అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) కార్యక్రమాలు కీలకమని ఏపీ సింగ్ తెలిపారు. ఏఎంసీఏతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో జాప్యం జరిగితే ప్రత్యామ్నాయ యుద్ధ విమానాల కొనుగోలును పరిశీలించాల్సి వస్తుందని అన్నారు.



**114 రాఫెల్ జెట్లపై చర్చలు**

114 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఖరారయ్యే అవకాశం ఉందని ఏపీ సింగ్ చెప్పారు. ధరతో పాటు ఇతర కీలక అంశాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. రష్యా తయారీ ఐదో తరం సుఖోయ్ 57పై మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

**చైనా–పాక్ సహకారంపై ఆందోళన**

పాకిస్థాన్, చైనాల మధ్య ఐదో తరం యుద్ధ విమానాల విషయంలో సహకారం భారత్‌కు ఆందోళన కలిగించే అంశమని ఎయిర్ చీఫ్ మార్షల్ పేర్కొన్నారు. అయితే పాకిస్థాన్ ఆ విమానాలను తన మొత్తం యుద్ధ వ్యవస్థతో సమర్థంగా అనుసంధానం చేసుకోకపోతే వాటి సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉపయోగపడదని అన్నారు.

**థియేటర్ కమాండ్ల విషయంలో జాగ్రత్త**

థియేటర్ కమాండ్ల ఏర్పాటుకు వైమానికదళం వ్యతిరేకం కాదని ఏపీ సింగ్ స్పష్టం చేశారు. అయితే వాటిని ఎలా, ఏ క్రమంలో అమలు చేయాలన్న అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎదురైన అనుభవాల అనంతరం ఈ అంశంపై జరుగుతున్న చర్చల్లో మార్పు వచ్చిందని తెలిపారు.

**ఆధునీకరణలో ఏఐ, డ్రోన్లకు ప్రాధాన్యం**

వైమానికదళ ఆధునీకరణలో కృత్రిమ మేధ, డ్రోన్లు, లాయిటరింగ్ మ్యూనిషన్స్, అంతరిక్ష సామర్థ్యాలు కీలకంగా మారుతున్నాయని ఏపీ సింగ్ చెప్పారు. ప్రత్యేక డ్రోన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం కంటే ప్రస్తుతం ఉన్న యుద్ధ వ్యవస్థల్లోనే డ్రోన్లను సమర్థంగా సమన్వయం చేయడం అవసరమని ఐఏఎఫ్ భావిస్తోందన్నారు. ప్రస్తుతం భారత వైమానికదళం ఫైటర్ స్క్వాడ్రన్ల కొరతను ఎదుర్కొంటోంది. దేశానికి 42 ఫైటర్ స్క్వాడ్రన్లు అవసరం కాగా, ప్రస్తుతం 29 స్క్వాడ్రన్లు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఒక్క స్క్వాడ్రన్‌లో 18 యుద్ధ విమానాలు ఉంటాయి.

# ఎల్ నినో ప్రభావం ఉన్నా కరెంటు కష్టాలు రానివ్వం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** దేశవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణం నెలకొన్నప్పటికీ ప్రజలకు కరెంటు కష్టాలు రానివ్వమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో రూ.6.65 కోట్లతో పాలేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ ను, వట్టుకుంట వాగు వరకు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 31 మందికి కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.."నూతన చెక్ డ్యామ్ ద్వారా నేలకొండపల్లితో పాటు కోదాడ మండలానికి కూడా సాగునీరు అందుతుంది. ఎల్ నినో ప్రభావం ఉన్నా తాగు, సాగునీటి కొరత రానీయకుండా చూశాం. ఇటీవలి తుఫానుతో కొంత మేలు జరిగింది. విద్యుత్ కొరత రానీయకుండా అవసరమైతే యూనిట్ రూ.12 చొప్పున ఇతర రాష్ట్రాల నుంచి కొనేందుకైనా సిద్ధంగా ఉన్నాం. ప్రత్యామ్నాయంగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాం. దీనిపై కేబినెట్ లో ప్రధానంగా చర్చించాం" అని తెలిపారు. "గత పాలకులది దొరల ప్రభుత్వం, మాది పేదోడి ప్రజా ప్రభుత్వం. సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి సంక్షేమాన్ని గడపగడపకు చేర్చాం. పేదల కల అయిన సొంతింటిని ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేర్చాం. మొదటి విడతలో 2.25 లక్షల ఇళ్లు పూర్తి చేశాం, రెండో విడత కూడా కేటాయించాం, ఒక్క హైదరాబాద్ లోనే లక్ష ఇళ్లు ఇచ్చాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య, బచ్చలికూర నాగరాజు, సర్పంచ్ సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిరంతర విద్యుత్...

- కరెంట్ కోతలు లేకుండా చుడాలని అధికారులకు సూచన..
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** మున్సిపల్ ప్రజలకు నిరంతర విద్యుత్ ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అన్నారు. శనివారం రోజు చేవెళ్ల మున్సిపల్ 10 వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ నడిమెల్ల లావణ్య శంకర్, వార్డు కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్ తో కలిసి 63 kv రెండు విద్యుత్ ట్రాన్స్ఫర్మర్లు ప్రారంభించడం జరిగింది. కరెంటు పట్ల ప్రజలు ఎలాంటి దిగులు చెందవద్దని వార్డు ప్రజలకు తెలిపారు. కరెంటు కోతలు లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో... మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, మూడవత్ కృష్ణ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బి రాములు, పిఏసిఎస్ సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నడిమోల మహేందర్, మాజీ డైరెక్టర్ బుర్ల మహేష్, విద్యుత్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఓబిసి సింహగర్జనను విజయవంతం చేయాలి..

**కాంగ్రెస్ శ్రేణులకు బొల్లారం వెంకట్ రెడ్డి, మడపతి చంద్రిమౌళి పిలుపు**





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం గొల్లపల్లిలో అక్టోబర్ 4న నిర్వహించనున్న "ఓబీసీ సింహగర్జన" మహాసభను విజయవంతం చేయాలని శంకర్ పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, బొల్లారం వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు, పిసి సి, ఓబిసి చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ మహాసభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఓబీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో తగిన ప్రాతినిధ్యం వంటి అంశాలపై చర్చించేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. "జిస్కీ జిత్నీ సంఖ్యా – ఉత్ని హిస్సేదారీ" అనే నినాదంతో ఓబిసిలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**భారీగా తరలిరావాలని పిలుపు...**

శంకర్ పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, ఓబీసీ సోదరులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బొల్లారం వెంకట్ రెడ్డి, మడపతి చంద్రిమౌళి కోరారు. అక్టోబర్ 4న మధ్యాహ్నం 3 గంటలకు గొల్లపల్లి, శంషాబాద్‌లో జరిగే ఈ మహాసభకు ఏఐసీసీ ఓబీసీ చైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపిసి చైర్మన్ మధు యాస్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ఓబీసీ హక్కుల కోసం ఐక్యతను చాటుదాం.. ఓబీసీ సింహగర్జనను విజయవంతం చేద్దాం అని వారు పిలుపునిచ్చారు.

# గొల్లపల్లిలో పశు వైద్య శిబిరం

**డాక్టర్ టి. రామ్ చందర్**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి.రామ్ చందర్ మాట్లాడుతూ పాడి పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రస్తుతం ఎల్ నినో వర్షాభావ ప్రభావంతో పశువులకు గడ్డి కొరత ఏర్పడే అవకాశం ఉంది కావున పాడి రైతులు పచ్చగడ్డి పెంచుకోవాలి అని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో 28 పశువులకు చూడి పరీక్షలు, 8 పశువులకు సాధారణ చికిత్సలు మరియు 10 దూడలకి నట్టల నివారణ మందులు వేయడం జరిగినది. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్ గారు,వార్డు సభ్యులు, వి ఎల్ ఓ శ్రీనివాస్ , జె వివో రాజ్ వీరయ్య,, సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**ఏపీఎం పద్మావతి**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి శ్రీ కాలభైరవ మండల సమైక్య ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామా సంఘాలుగా తయారు కావడానికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్బంగా మండల సమైక్య అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. గ్రామ సంఘాల్లో తీసుకున్న డబ్బులతో ఉపాధి పొందుతూ కుటుంబ పోషణ సక్రమంగా నిర్వహించాలని మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తుందని ఏపిఎం పద్మావతి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐకేపి సిసి లు శ్రీనివాస్, లింగం, నవీన్, భూమాగౌడ్, అనిలా, వివో ఏలు, గ్రామాల సంఘం ప్రతినిధులు, మహిళలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేట్ బస్సు ప్రమాదం

**సంఘటనా స్థలాన్ని పరిస్థితులను సమీక్షించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**





**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా అనంత గిరి ఘాట్ రోడ్డులో ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ తక్షణమే స్పందించింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కేసారం గ్రామానికి చెందిన ప్రయాణికులు దారూర్ మండలం చింతకుంట గ్రామానికి అంత్యక్రియలకు వెళ్తుండగా అనంత గిరి ఘాట్ రోడ్డులో ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమాచారం అందుకున్న వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సంఘటనా స్థలాన్ని వెంటనే వెళ్లి ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారులను అడిగి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడం, సహాయక చర్యలను సమన్వయం చేయడంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జిల్లా కలెక్టర్‌తో కలిసి వికారాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికీ మెరుగైన వైద్య చికిత్స అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్యులను ఆదేశించారు. క్షతగాత్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# పి ఆర్ టి ఏ నూతన జిల్లా కమిటీ ఎన్నిక



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి పి ఆర్ టి ఏ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజాంబాద్ జిల్లా గురుకుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు, 30 మంది సభ్యులతో నూతన కమిటీని అనుకున్నారు. అధ్యక్షుడిగా సూర్య కాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాపయ్య, ఉపాధ్యక్షుడిగా బి హనుమన్లు, అసోసియేట్ ప్రెసిడెంట్ గా శ్రీనివాస్, కార్యదర్శిగా నరసయ్య ఎన్నికయ్యారు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా మహమ్మద్ ఉస్మాన్



**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా మహమ్మద్ ఉస్మాన్ నియమితులయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మహమ్మద్ ఉస్మాన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్‌లో కీలక బాధ్యతలు లభించడం పట్ల ఆయన అభినందనలు వ్యక్తం చేస్తూ, పార్టీకి మరియు మైనారిటీ వర్గాలకు మరింత సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. నూతన బాధ్యతలపై మహమ్మద్ ఉస్మాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించేందుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన రాజకీయ ప్రయాణంలో శ్రీశైలం గౌడ్ అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం, ఆశీస్సులు ఎల్లప్పుడూ తనకు ఉండాలని ఆకాంక్షించారు. మైనారిటీ వర్గాల సమస్యలను సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మహమ్మద్ ఉస్మాన్ తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక అభివృద్ధి వంటి అంశాల్లో మైనారిటీ వర్గాలకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించడంతో పాటు, మైనారిటీ వర్గాలకు పార్టీతో మరింత అనుసంధానం పెంచేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని మహమ్మద్ ఉస్మాన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహమ్మద్ ఉస్మాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నూతన పదవిలో ఆయన విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.

# వెన్నవల్లి గుట్ట వద్ద విషాదం.. మట్టి కిందపడి జేసీబీ డ్రైవర్ దుర్మరణం

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్దకోరుకొండి – వెన్నవల్లి మధ్య ఉన్న వెన్నవల్లి గుట్ట వద్ద విషాదకర ఘటన చోటుచేసుకుంది. గుట్ట వద్ద సొరంగం తరహాలో మట్టి తవ్వకాలు చేపడుతుండగా ఒక్కసారిగా మట్టి కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అక్కడ పనిచేస్తున్న జేసీబీ డ్రైవర్ మట్టి కింద చిక్కుకుని దుర్మరణం చెందాడు. టిప్పర్ లారీ కూడా పూర్తిగా మట్టిలో కూరుకుపోయింది (ఫోటోలో). స్థానికుల కథనం ప్రకారం, వెన్నవల్లి గుట్ట వద్ద గత కొన్ని నెలలుగా ప్రమాదకర రీతిలో తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో పనులు జరుగుతున్నాయని పలుమార్లు చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలా?**

గుట్ట తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు మించి తవ్వకాలు జరిగాయా? భద్రతా ప్రమాణాలు పాటించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "జేసీబీ డ్రైవర్ ప్రాణాన్ని తిరిగి తీసుకొస్తారా? మైనింగ్ అధికారులు సమాధానం చెప్పాలి" అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై మైనింగ్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, తవ్వకాల అనుమతులు, భద్రతా నిబంధనల అమలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు 20 లక్షల గాయపడిన వారికి 5 లక్షలు ప్రభుత్వం ఇవ్వాలి

**సిపిఎం వికారాబాద్ జిల్లా కార్యదర్శి మహిపాల్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతగిరిగుట్ట లో బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుండి 20 లక్షల రూపాయలు, ప్రమాదంలో గాయపడి కుటుంబాలకు ప్రభుత్వం 5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని బస్సు యాజమాని నుంచి ప్రతి కుటుంబానికి 20 లక్షల రూపాయల పరిహారం ఇప్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వికారాబాద్ నుంచి అనంతగిరి రూటు అనేక మలుపులో ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు సూచిక బోర్డులు స్వీకరణ వద్ద బోర్డులు టర్నింగ్ పాయింట్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదు తక్షణమే సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, అనంతగిరి గుట్టపైన ప్రతి వారము టూరిస్టులు వస్తున్న సందర్భంగా రోడ్డుపై వాహనాలు నిలవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుపై పబ్లిక్ జామ్ కావడం జరుగుతుంది అన్నారు. టూరిస్ట్ వారి నుంచి వచ్చే వసూలు డబ్బుల మీద ప్రేమ ఉన్న ప్రేమ దారిన పోయే ప్రయాణికులపై వాహనాలపై లేదని తక్షణమే పారాష అధికారులపై చట్టపరిమ చర్యలు తీసుకుని రోడ్లపై ట్రాఫిక్ జాయిన్ చేయకుండా నియమనిబంధనలు పాటించాలని ప్రభుత్వం వెంటనే స్పందించి నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. వికారాబాద్ నుంచి అనంతగిరి పోయే దారిలో భారీ వాహనాలు బస్సులు పోకుండా కింది రూట్లో డైవర్స్ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్ మహిపాల్ నాయకులు సతీష్, తేజ, రాజు, వెంకట్, కృష్ణ, రమేష్, అశోక్, శేఖర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు



# తెలుగు పాఠకుల మానసిక, సామాజిక స్ఫూర్తి

## లల్లాదేవి సాహిత్య సృష్టి

తెలుగు సాహిత్యంలో తన ప్రత్యేక శైలీతో, సమాజంపై లోతైన అవగాహనతో వెలుగొందిన రచయిత లల్లాదేవి, అసలు పేరు పరుచూరి నారాయణాచార్యులు, 1943లో ఆంధ్రప్రదేశ్‌లో జన్మించారు. చిన్నతనంలోనే ఆయన సాహిత్య పట్ల గాఢమైన ఆసక్తి చూపారు. చదువులో ప్రావీణ్యం, చరిత్రా గ్రంథాలపై లోతైన అవగాహన ఆయనను సాహిత్య ప్రవేశానికి ప్రేరేపించాయి. కుటుంబ వాతావరణం సాంప్రదాయ విలువలకు, విద్యా గౌరవానికి ప్రాధాన్యం ఇచ్చి, ఆయన వ్యక్తిత్వానికి బలమైన మద్దతు అందించింది. చిన్న వయసులోనే పాఠశాలలో సాహిత్య ప్రతిభను ప్రదర్శించడం, కవిత్వం, కథల పఠనంలో చురుకైన పాల్గొనడం ఆయన ప్రతిభను ప్రతిబింబించింది. యువ వయసులోనే కథలు రాయడం ప్రారంభించిన లల్లాదేవి, తొలినాళ్లలో వ్యక్తిగత అనుభవాలు, సామాజిక పరిస్తితులను ప్రతిబింబిస్తూ పాఠకులను ఆకర్షించే విధంగా కథలను రూపొందించారు. ఆ తరువాతి దశలో ఆయన సాంఘిక, చారిత్రక నేపథ్యాలతో నవలలు, నాటకాలు, కథా సంపుటాలు రచించడం ప్రారంభించారు. సమాజంలోని సమస్యలు, న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, మానవత్వం ఆయన రచనల్లో ప్రతిష్టాత్మక అంశాలుగా నిలిచాయి. ఆయన రచనలలో ముఖ్యంగా నవలలు పాఠకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేశాయి. మహా స్వప్నం, మా తెలుగు తల్లి, రాక్షస రాజ్యం, రుద్రవీణ, రుద్రనాగు, రోహిణి, లకుమాదేవి, విశ్వవిజేత సికిందర్, శ్వేతనాగు, శ్వేత శిఖరం, సర్పనేత్రం, సాగరదుర్గం, సాగర మేఖల, ధర్మయజ్ఞం, సామ్రాట్ అశోక్, సులక్షణ వంటి రచనలు సమాజ, చరిత్ర, వ్యక్తిత్వ నిర్మాణం, మానవ సంబంధాలు, నైతిక విలువలపై పాఠకులను ఆలోచింపజేసే విధంగా నిలిచాయి. ప్రతి నవలలో పాత్రల లోతైన నిర్మాణం, భావోద్వేగ ప్రతిబింబం, చారిత్రక సందర్భాల సరళమైన కానీ లోతైన వివరణ ఆయన సృజనాత్మకతను ప్రతిబింబించాయి. కథా సంపుటాలలో క్షేత్రవతి ప్రధానంగా నిలిచి, సామాజిక, చారిత్రక నేపథ్యాలను, పాత్రల మనస్తత్వాన్ని, నైతిక ప్రశ్నలను ప్రతిబింబించింది. నాటకాల్లో మహామంత్రి తిమ్మరుసు ముఖ్యంగా గుర్తింపు పొందింది. ఇందులో రాజకీయ, సామాజిక చైతన్యం, వ్యక్తుల సంకల్పబలం వేదికపై ప్రతిబింబించాయి. ఇతర రచనలలో లల్ల రామాయణము, వాత్సాయన కామశాస్త్రం వంటి సంపుటాలు, వ్యాసాలు, పరిశీలనలు ఆయన సాహిత్య పరిజ్ఞానాన్ని విస్తరించాయి. ఈ రచనలన్నీ పాఠకులకు వినోదం మాత్రమే కాకుండా చైతన్యం, మానవత్వం, న్యాయప్రవృత్తి, సామాజిక బాధ్యతలపై ఆలోచన కలిగించాయి. ప్రతి పాత్ర, ప్రతి సంభాషణ, ప్రతి పరిస్తితి లోతుగా ఆలోచింపజేసే విధంగా రూపుదిద్దబడ్డాయి. ఆయన సాహిత్య శైలిలో లోతైన, స్పష్టమైన భావప్రకటన, సంభాషణలో సహజత్వం, పాత్రల లోతైన నిర్మాణం, సమాజ, చరిత్ర, మానవ సంబంధాలపై ప్రతిబింబం ఉన్నాయి. విమర్శకులు లల్లాదేవి రచనలను విశేషంగా పొగిడారు. ఆచార్య జి.వి.కృష్ణరావు అభిప్రాయం ప్రకారం, లల్లాదేవి రచనలు తాత్త్విక గంభీరతతో పాటు మానవీయతను సమన్వయం చేశాయి. డాక్టర్ చేకూరి రామారావు వ్యాఖ్యానించినట్లు, సాహిత్య చరిత్రలో లల్లాదేవి పరిశోధనాత్మక దృష్టి ఒక ప్రత్యేకమైన మైలురాయి. తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్యవేత్తలు ఆయన రచనలను సాంప్రదాయ శాస్త్రీయత, ఆధునిక సామాజిక దృక్పథం కలయికగా అభివర్ణించారు. జీవితకాలంలో లల్లాదేవి అనేక సాహిత్య పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్ర, జాతీయ సాహిత్య మండలుల సత్కారాలు, నాటక, నవల, కథల ప్రదర్శనలు ఆయన ప్రతిభను గుర్తించాయి. ఆయన కృషికి గౌరవం ప్రకటించాయి. సమకాలీన ప్రముఖ తెలుగు సాహిత్యకారులు, విమర్శకులు ఆయనను సృజనాత్మకత, విశ్లేషణ శక్తి, సామాజిక అవగాహనకు ప్రతీకగా గౌరవించారు. 82 ఏండ్ల వయసులో ఆయన కన్నుమూశారు. ఆయన మరణం తెలుగు సాహిత్య, నాటక, పాఠక వర్గాలలో అపరిమిత శోకాన్ని రేపింది. ఆయన సృష్టించిన నవలలు, కథలు, నాటకాలు, వ్యాసాలు, పరిశీలనలు, భాషా శైలి, సృజనాత్మకత శాశ్వతంగా నిలిచిపోతాయి. ఆయన జీవితం, సాహిత్యకళ, సమాజంపై చూపిన దృష్టి భవిష్యత్తు తరాల తెలుగు పాఠకులకు మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. లల్లాదేవి రచనలు ప్రతీ నవల, కథ, నాటకంలో ప్రతిబింబించిన సమాజ అవగాహన, చారిత్రక పరిశీలన, మానవతా విలువలు, నాటకకళలో చూపిన నైపుణ్యం, భాషా శైలీ కారణంగా ఆయనను తెలుగు సాహిత్యంలో శాశ్వత ప్రతీకగా నిలిపాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వాటికీ బతికే హక్కుంది!

## నేడు ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం




వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. ఇలా జంతువుల జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే 'ప్రపంచ జంతు దినోత్సవం' ముఖ్యోద్దేశం. ఏటా అక్టోబర్ 4న ఈ జంతు దినోత్సవాన్ని అంతర్జాతీయంగా నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థక మవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు దీన్ని ప్రపంచ జంతు దినోత్సవాన్ని జరుపు తున్నాయి. ప్రపంచ జంతు దినోత్సవాన్ని సైనాలజిస్ట్ హెన్రిచ్ జిమ్మెర్మాన్ ప్రారంభించాడు. ఆయన మొదటి ప్రపంచ జంతు దినోత్సవాన్ని 24 మార్చి 1925 న జర్మనీలోని బెర్లిన్‌లోని స్పోర్ట్ ప్యాలెస్‌లో నిర్వహించాడు. దీనికి 5,000 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. అనంతరం ఇది 1929లో అక్టోబరు 4కు మార్చ బడింది. ప్రారంభంలో అతను జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ మరియు చెకోస్లోవేకియాలో మాత్రమే పాటించారు. చివరగా, మే 1931 లో ఫ్లోరెన్స్ ఇటలీలో జరిగిన ఇంటర్నేషనల్ యానిమల్ ప్రొటెక్షన్ కాంగ్రెస్ సమావేశంలో, అక్టోబర్ 4 ప్రపంచ జంతు దినోత్సవాన్ని సార్వత్రికం చేయాలన్న ఆయన ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించి తీర్మానంగా ఆమోదించారు. హీన్రిచ్ జిమ్మెర్మాన్ చేసిన కార్యక్రమాల, ప్రచారం కారణంగా 1931, మే నెలలో ఇటలీలోని ఫ్లోరెన్స్లో జరిగిన అంతర్జాతీయ జంతు రక్షణ సదస్సులో అక్టోబరు 4ను అంతర్జాతీయ జంతు దినోత్సవంగా ఏకగ్రీవంగా అమోదించడం జరిగింది. ప్రపంచ జంతు దినోత్సవం 2003 నుండి యునైటెడ్ కింగ్డమ్ ఆధారిత జంతు సంక్షేమ స్వచ్ఛంద సంస్థ నేచర్ వాచ్ ఫౌండేషన్ నేతృత్వంలోని మరియు స్పాన్సర్ చేసిన జంతు సంరక్షణ ఉద్యమాన్ని ఏకం చేసే ప్రపంచ కార్యక్రమంగా పెరుగుతోంది. జాతీయత, మతం, విశ్వాసం లేదా రాజకీయ భావజాలంతో సంబంధం లేకుండా అనేక దేశాలలో విస్తృతంగా అంగీకరించ బడింది మరియు వివిధ రకాలుగా జరుపు కుంటారు. దినోత్సవం రోజున జంతు సంక్షేమ ప్రచారంతో పాటుగా జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు




- అంతరిస్తున్న జాతులను కాపాడటమే అసలు లక్ష్యం
- అడవులు కరిగితే.. వన్యప్రాణులు జనావాసాల్లోకి రావడం అనివార్యం
- వేట, అక్రమ రవాణా, ఆవాసాల విధ్వంసమే జీవవైవిధ్యానికి పెను ముప్పు
- జంతువులను ప్రేమించడమే కాదు.. వాటి సహజ ఆవాసాలను కాపాడటమూ మన బాధ్యత




సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102.

1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది.

ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి.

అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతల బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా. 2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశం లోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.

భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. ఈరోజును జంతు ప్రేమికుల దినోత్సవంగా కూడా పిలుస్తారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494





# గోల్ఫ్‌లో ప్రణవికి స్వర్ణం..

## చరిత్ర సృష్టించిన భారత క్రీడాకారిణి

**నాగోయా, అక్టోబరు 3:** ఆసియా క్రీడల్లో భారత యువ గోల్ఫర్ ప్రణవి ఉర్స్ చారిత్రక ప్రదర్శనతో మెరిసింది. మహిళల వ్యక్తిగత స్ట్రోక్ ప్లే విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించింది. తద్వారా ఆసియా క్రీడల్లో మహిళల వ్యక్తిగత గోల్ఫ్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ప్రణవి ప్రదర్శనతో పాటు మహిళల జట్టు విభాగంలోనూ భారత్‌కు రజత పతకం దక్కింది. కసుగై కంట్రీ క్లబ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రణవి మొత్తం 15-అండర్ 265 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. చివరి రోజు మూడు స్ట్రోకుల ఆధిక్యంతో బరిలోకి దిగిన ఆమెకు మూడో హోల్‌లో ట్రిపుల్ బోగీ ఎదురైంది. దీంతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే ప్రణవి ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా పుంజుకుంది. 6, 10, 13వ హోల్స్‌లో కీలక బర్డీలు సాధించి మళ్లీ ఆధిక్యంలోకి వచ్చింది. చివరి వరకు అదే జోరును కొనసాగిస్తూ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. చైనాకు చెందిన యిన్ రునింగ్, సింగపూర్‌కు చెందిన షానన్ టాన్ సంయుక్తంగా రజత పతకాలు సాధించారు. వ్యక్తిగత విభాగంలో ప్రణవితో పాటు పోటీపడిన అదితి అశోక్ 14వ స్థానంలో, దీక్షా దాగర్ 23వ స్థానంలో నిలిచారు. జట్టు విభాగంలో ప్రణవి కీలక ప్రదర్శన చేయడంతో భారత మహిళల జట్టు 14-అండర్ 546 స్కోరుతో రజత పతకాన్ని సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో మహిళల గోల్ఫ్ జట్టు విభాగంలో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం, జట్టు విభాగంలో రజతంతో ప్రణవి ఉర్స్ ఆసియా క్రీడల్లో భారత గోల్ఫ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.

# ప్రపంచ ఛాంపియన్‌పై గెలుపు..

## అమన్‌కు స్వర్ణం

- ఆసియా క్రీడల కుస్తీ పోటీల్లో స్వర్ణం నెగ్గిన భారత వీరుడు
- 57 కేజీల విభాగంలో పసిడి గెలిచిన తొలి భారతీయ మల్లయోధుడిగా రికార్డు



**నాగోయా, అక్టోబరు 3 :** ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్ అమన్ శెహ్రావత్ అదరగొట్టాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ హాన్ చోంగ్ సాంగ్‌ను 11-7 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. దీంతో ఈ విభాగంలో ఆసియా క్రీడల స్వర్ణం సాధించిన తొలి భారత రెజ్లర్‌గా అమన్ రికార్డు సృష్టించాడు. నాగోయా సిటీ ఇనాయే స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. ఒక దశలో అమన్ 6-1 ఆధిక్యంలో ఉన్నాడు. అయితే ఉత్తర కొరియా రెజ్లర్ పుంజుకుని వరుస పాయింట్లు సాధించడంతో 7-6 ఆధిక్యంలోకి వెళ్లాడు. పోటీ ముగిసే సమయంలో అమన్ తన అనుభవాన్ని ప్రదర్శించాడు. టేక్‌డౌన్‌తో రెండు పాయింట్లు, అనంతరం రోల్‌తో మరో రెండు పాయింట్లు సాధించి 11-7 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ప్రత్యర్థి చేసిన ఛాలెంజ్ విఫలం కావడంతో అమన్ ఆధిక్యం మరింత బలపడింది. చివరి 30 సెకన్లలో ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు. అమన్‌కు ఆసియా క్రీడల్లో ఇది రెండో పతకం. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో కాంస్యం సాధించిన అతడు.. ఇప్పుడు స్వర్ణం గెలిచాడు. పారిస్ ఒలింపిక్స్‌లోనూ కాంస్య పతకం సాధించాడు. ఈసారి ఫైనల్ వరకు అమన్ అద్భుత ప్రదర్శన చేశాడు. తొలి రౌండ్‌లో జపాన్‌కు చెందిన యమటో ఒగావాను 20-9తో, క్వార్టర్‌ఫైనల్లో కజకిస్థాన్‌కు చెందిన నుర్దానత్ ఐతానోవ్‌ను 12-1తో ఓడించాడు. సెమీఫైనల్లో 2-6తో వెనుకబడినప్పటికీ రెండో భాగంలో 12 పాయింట్లు సాధించి 14-8తో విజయం సాధించాడు. ఇదే ఆసియా క్రీడల్లో పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్‌లో సుజీత్ కల్కల్ కూడా స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. తజికిస్థాన్‌కు చెందిన అబ్దుల్ మజీద్ కుదియేవ్‌ను 10-9తో ఓడించాడు. దీంతో ఆసియా క్రీడల్లో పురుషుల ఫ్రీస్టైల్‌లో భారత్ రెండు స్వర్ణ పతకాలు సాధించింది. 1978 తర్వాత ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో ఆసియా క్రీడల్లో భారత రెజ్లింగ్ బృందం సత్తా చాటింది.

# పాక్‌పై తిలక్ వర్మ మెరుపులు.

## అరుదైన రికార్డు

**నాగోయా, అక్టోబరు 3 :** ఆసియా క్రీడలు 2026 పురుషుల క్రికెట్ ఫైనల్లో టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన తుది పోరులో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్.. కేవలం 22 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. తిలక్ దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ 20 ఓవర్లలో 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాకిస్థాన్‌పై అంతర్జాతీయ టీ20 ఫైనల్స్‌లో రెండుసార్లు 50కిపైగా పరుగులు సాధించిన తొలి ఆటగాడిగా తిలక్ వర్మ రికార్డు సృష్టించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది ఆసియా కప్ ఫైనల్లోనూ పాక్‌పై అజేయంగా 69 పరుగులు చేసిన తిలక్.. ఇప్పుడు ఆసియా క్రీడల ఫైనల్లో మరోసారి అర్ధశతకంతో మెరిశాడు. దీంతో పాకిస్థాన్‌పై కీలక మ్యాచ్‌ల్లో తన స్థాయిని మరోసారి చాటుకున్నాడు. టీ20 ఫైనల్స్‌లో రెండుసార్లు 50కిపైగా పరుగులు చేసిన భారత బ్యాటర్ల ప్రత్యేక జాబితాలోనూ తిలక్ వర్మ చోటు సంపాదించాడు. అంతకుముందు విరాట్ కోహ్లీ 2014, 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఈ ఘనత సాధించాడు. దీంతో కోహ్లీతో కలిసి తిలక్ ఈ ప్రత్యేక జాబితాలో నిలిచాడు. భారత్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకున్నారు. ముఖ్యంగా తిలక్ వర్మ, శివమ్ దూబే కలిసి ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దూబే 15 బంతుల్లో 27 పరుగులు చేయగా.. తిలక్ చివరి వరకు క్రీజులో నిలిచి వేగంగా పరుగులు సాధించాడు. వీరిద్దరి దూకుడుతో భారత్ 200 పరుగుల మార్కును దాటి 211 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్‌ను 192 పరుగులకే పరిమితం చేసి భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించారు.



# పాక్‌పై భారత్ హ్యాట్రిక్.. ఆసియా క్రీడల్లో స్వర్ణం

**నాగోయా, అక్టోబరు 3 :** భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అంటేనే అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి. ఆసియా క్రీడలు 2026 పురుషుల క్రికెట్ ఫైనల్లోనూ అదే ఉత్కంఠ కనిపించింది. అయితే మరోసారి భారత్‌దే పైచేయి అయింది. పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించిన టీమిండియా వరుసగా రెండోసారి ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత్ తొలుత 20 ఓవర్లలో 211/6 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 61 పరుగులతో మెరుపు ఆరంభం ఇవ్వగా.. తిలక్ వర్మ 22 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలిచి ఇన్నింగ్స్‌కు భారీ ముగింపు ఇచ్చాడు. లక్ష్య ఛేదనలో హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులతో అద్భుతంగా పోరాడినా.. భారత బౌలర్లు మిగతా బ్యాటర్లను కట్టడి చేయడంతో పాకిస్థాన్ 192/6కే పరిమితమైంది. భారత్-పాకిస్థాన్ ఫైనల్ పోరాటాలకు ప్రత్యేక చరిత్ర ఉంది. 2007 తొలి టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలిచింది. అనంతరం ఆసియా కప్ టైటిల్ పోరులోనూ భారత్ విజయం సాధించగా.. ఇప్పుడు ఆసియా క్రీడల ఫైనల్లోనూ పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. దీంతో కీలక టీ20 ఫైనళ్లలో పాక్‌పై భారత్ ఆధిపత్యం మరోసారి చర్చనీయాంశమైంది. పాకిస్థాన్‌పై కీలక ఫైనల్లో తిలక్ వర్మ మరోసారి భారత విజయానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. ఒత్తిడిలోనూ దూకుడుగా ఆడిన అతడు 22 బంతుల్లోనే 51 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. అభిషేక్ శర్మతో కలిసి భారత్‌కు







బలమైన స్కోరు అందించిన అనంతరం భారత బౌలర్లు ఆ ఆధిక్యాన్ని విజయంగా మలిచారు. దీంతో ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్‌లో భారత్ వరుసగా రెండోసారి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది.

# 60 ఏళ్ల తర్వాత.. దీపక్ పూనియాకు కాంస్యం



**నాగోయా, అక్టోబరు 3 :** ఆసియా క్రీడలు 2026లో భారత రెజ్లర్ దీపక్ పూనియా చారిత్రక పతకాన్ని సాధించాడు. పురుషుల 97 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మంగోలియాకు చెందిన ఘన్‌కుయగ్ గన్‌బాతర్‌పై 2-1 తేడాతో విజయం సాధించి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. దీంతో ఈ విభాగంలో భారత్ దాదాపు ఆరు దశాబ్దాల పతక నిరీక్షణకు తెరపడింది. దీపక్, గన్‌బాతర్ మధ్య జరిగిన పోరు హోరాహోరీగా సాగింది. ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా దీపక్ పట్టువిడవకుండా పోరాడాడు. చివరికి 2-1తో విజయం సాధించి కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. పోడియంపై మువ్వన్నెల జెండాతో నిలిచిన దీపక్ భారత అభిమానులను ఆనందంలో ముంచెత్తాడు. గత ఆసియా క్రీడల్లోనూ దీపక్ పూనియా పతకం సాధించాడు. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో 86 కేజీల విభాగంలో రజత పతకాన్ని గెలిచిన అతడు.. ఈసారి 97 కేజీల విభాగంలో కాంస్యంతో మెరిశాడు. విభాగం మారినా ఆసియా క్రీడల్లో వరుసగా రెండోసారి పతకం సాధించడం విశేషం. పురుషుల 97 కేజీల విభాగంలో భారత్‌కు గతంలో 1962లో మారుతి మనే స్వర్ణం, గణ్‌పత్ అందల్కర్ రజతం సాధించారు. 1966లో బిష్వంత్ సింగ్ సిల్వర్, భీమ్ సింగ్ కాంస్య పతకాలు గెలిచారు. ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు పతకం దక్కలేదు. ఇప్పుడు దీపక్ పూనియా కాంస్యంతో ఆ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. ఈ పతకంతో ఆసియా క్రీడల్లో భారత పతకాల సంఖ్య 83కు చేరింది. ఇందులో 20 స్వర్ణాలు, 26 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.



# నువ్వుంటేనే కిక్

## మరెవరితోనూ ఊహించుకోలేను!’

సినిమా నిర్మాణంలో కథతో పాటు అందులో కలిసి పనిచేసే వ్యక్తులు కూడా చాలా ముఖ్యమని కథానాయిక మాళవిక మోహనన్ పేర్కొన్నారు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ అలరిస్తున్న ఈ భామ, ఇటీవల ‘సర్దార్ 2’ చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం విజయ్ సేతుపతికి జోడీగా ‘పాకెట్ నోవెల్’ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా సినిమా మేకింగ్ ప్రయాణం, విజయ్ సేతుపతితో కలిసి పనిచేసిన అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా ఆమె అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాళవిక మోహనన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ.. “కొన్ని సినిమాలు తీస్తున్న సమయంలో అవే ఒక చిన్న ప్రపంచంగా మారిపోతాయి. అలాంటిదే ఈ ‘పాకెట్ నోవెల్’ చిత్రం. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా ప్రయాణంలో నేను నేర్చుకున్న ముఖ్యమైన విషయం ఏమిటంటే.. కేవలం నటన మాత్రమే కాదు, ఎవరితో కలిసి పనిచేస్తున్నామనేది కూడా అంతే ముఖ్యం. ఓ చిత్ర బృందంతో కలిసి నెలల తరబడి గడుపుతాం. ప్రతిరోజూ ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కష్టసుఖాలను పంచుకుంటాం. అలా తెలియకుండానే ఆ టీమ్ ఒక కుటుంబంలా మారిపోతుంది” అని పేర్కొన్నారు. అలాగే నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసలు కురిపిస్తూ.. “అద్భుతమైన నటుడైన విజయ్ సేతుపతితో కలిసి నటించడం ఓ గొప్ప అనుభవం. ఆయనతో తప్ప ఈ సినిమా ప్రయాణాన్ని మరెవరితోనూ ఊహించుకోలేను” అని రాసుకొచ్చారు. ప్రస్తుతం మాళవిక చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.



# బన్నీ-అట్లీ సినిమాలో నేను లేను!

## ‘రాకా’లో నెగెటివ్ రోల్ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి క్లారిటీ

**హైదరాబాద్, అక్టోబర్ 3 :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్--దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ చిత్రంలో తాను నటిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంపై మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నెగెటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో ఐశ్వర్య కనిపించనున్నారంటూ కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా.. అందులో నిజం లేదని ఆమె తేల్చేశారు. తాను ఈ ప్రాజెక్టులో భాగమే కాదని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ ప్రచారం తొలిసారి చూసినప్పుడు ఆశ్చర్యంతోపాటు నవ్వు వచ్చిందని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా ‘అసలు ఆ సినిమాలో నేనే లేను.. ఎవరైనా నాకు ఈ ప్రాజెక్టులో అవకాశం ఇప్పిస్తే బాగుంటుంది’ అంటూ సరదాగా స్పందించారు. దీంతో ఆమె నెగెటివ్ పాత్రలో నటిస్తున్నారన్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడింది. అట్లీ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కథలో నాలుగు కీలక మహిళా పాత్రలు ఉంటాయనే వార్తలూ వినిపిస్తున్నాయి. ప్రధాన పాత్ర కోసం దీపికా పదుకొణె పేరు బలంగా ప్రచారంలో ఉండగా, ఫెమినా జార్జ్ మరో కీలక పాత్రకు ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. జాన్వీ కపూర్, రష్మిక మందన్న పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ వీటిపై చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ‘పుష్ప’ చిత్రాలతో అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా వచ్చిన ఆదరణ, ‘జవాన్’తో అట్లీ సాధించిన భారీ విజయం నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే చిత్రానికి ‘రాకా’ అనే టైటిల్, నలుగురు కథానాయికలు, ఇతర తారాగణం గురించి జరుగుతున్న ప్రచారంలో ఏది అధికారికమో చిత్రబృందం ప్రకటించిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాస రావు మృతి





**చెన్నై, అక్టోబర్ 3 :**

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (95) శనివారం చెన్నైలో మరణించారు. వయోభారంతో చెన్నై కావేరీ ఆసుపత్రిలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సింగీతం శ్రీనివాసరావు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో సెప్టెంబరు 21, 1931 జన్మించారు. ప్రతిభాశాలురైన సినిమా దర్శకులలో ఒకరు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో సందేశాత్మకమైవీ, ప్రయోగాత్మకమైనవీ, కథాభరితమైనవీ– ఇలా వైవిధ్యం గల పెక్కు సినిమాలకు దర్శకత్వం వహించి ఆయన ప్రేక్షకులనూ, విమర్శకులనూ మెప్పించాడు. మయూరి, పుష్పక విమానం, ఆదిత్య 369, మైఖేల్ మదన్ కామరాజు వంటి వైవిధ్యము గల సినిమాలకు దర్శకత్వము వహించాడు. ఇంకా ఆయన మంచి సంగీత దర్శకుడు, కథకుడు కూడా. ఆయన చివరగా తన 94వ ఏట నాగ్ అశ్విన్ తో 'సింగ్ గీతం అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. చలనచిత్ర రంగం శ్రీనివాసరావుకు ప్రధాన ధ్యేయం. పట్టు వదలకుండా సుప్రసిద్ధ దర్శకుడు కె.వి.రెడ్డి వెంటబడి ఆయనకు అనుచరునిగా పనిచేయడం మొదలుపెట్టాడు. మాయాబజార్ చిత్రంతో మొదలుపెట్టి చాలా చిత్రాలలో కె.వి.రెడ్డి చేతిక్రింద పనిచేశాడు. పట్టాభి రామిరెడ్డి కన్నడంలో యు.ఆర్.అనంతమూర్తి నవల ఆధారంగా సంస్కార సినిమా తీయ సంకల్పించినపుడు శ్రీనివాసరావును ఎక్సిక్యూటివ్ డైరెక్టరుగా తీసుకొన్నాడు. ఈ సినిమాకు రాష్ట్రపతి బంగారు పతకం లభించింది.

1972లో సింగీతం పూర్తి దర్శకత్వం వహించిన 'నీతి నిజాయితీ' సినిమాను విమర్శకులు ప్రశంసించారు గాని ఆర్థికంగా విఫలమయ్యింది. 1975లో తీసిన జమీందారుగారి అమ్మాయి ఆయన మొదటి విజయవంతమైన చిత్రం. కాని 1976లో వచ్చిన అమెరికా అమ్మాయి అన్ని వర్గాల ప్రేక్షకులనూ మెప్పించడమే గాక సంగీత పరంగా మంచి విజయం సాధించింది. ఆ కోవలోనే పంతులమ్మ విజయవంతమైంది. ఆ తరువాత సింగీతం విజయ పరంపర, ప్రయోగ పరంపర సమాంతరంగా సాగాయి ముఖ్యంగా కమల్ హాసన్‌తో సింగీతం సొమ్మొకడిది సోకొకడిది సినిమాతో ఆరంభించి పలు చిత్రాలను విజయవంతంగా తీశాడు. వాటిలో మైఖేల్ మదన కామరాజు, అమావాస్య చంద్రుడు, అపూర్వ సహోదరులు ముఖ్యమైనవి. సందేశాత్మకంగా తీసిన చిత్రాలలో తరం మారింది ముఖ్యమైంది. డైలాగులు లేకుండా తీసిన పుష్పక విమానం అన్ని "భాషలలో" ప్రదర్శించారు. మయూరి సినిమాలో "సుధా చంద్రన్" చరిత్రను సున్నితంగా తెరకెక్కించాడు. తెలుగులో వచ్చిన కొద్ది సైన్స్ ఫిక్షన్ సినిమాలలో ఆదిత్య 369 ఒకటి. భైరవద్వీపం సినిమాతో ప్రేక్షకులు మరచిపోతున్న జానపదచిత్రాలను గుర్తు చేశాడు. కన్నడంలో రాజకుమార్ ప్రధాన చిత్రాలలో శ్రావణబంతు ఒకటి. దాదాపు 42 చిత్రాలకు దర్శకత్వం వహించగా వీటిలో ఎక్కువగా ప్రయోగాత్మక చిత్రాలు ఉన్నాయి.

# రచితా రామ్ బుగ్గలు గిల్లిన అభిమాని..

**బెంగళూరు, అక్టోబర్ 3 :** కన్నడ స్టార్ హీరోయిన్, ‘డింపుల్ క్వీన్’ రచితా రామ్‌కు తన పుట్టినరోజు వేడుకల్లో ఓ అభిమాని నుంచి ఊహించని అనుభవం ఎదురైంది. సెల్ఫీ తీసుకున్న ఆనందంలో ఒక యువకుడు ఆమె బుగ్గలు గిల్లగా, రచిత ఏమాత్రం ఆగ్రహం వ్యక్తం చేయకుండా చిరునవ్వుతో స్పందించి అభిమానుల మనసు గెలుచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com